24 మంది ఇజ్రాయెల్ సైనికుల మృతి

జెరూసలేం: హమాస్‌తో యుద్ధంలో ఇజ్రాయెల్ సైన్యానికి మొదటిసారిగా గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సెంట్రల్ గాజాలో హమాస్ మిలిటెంట్లు జరిపిన బాంబుదాడుల్లో 21 మంది సైనికులు, మరో చోట జరిగిన కాల్పుల ఘటనలో ముగ్గురు ఐడీఎఫ్ అధికారులు ప్రాణాలు కోల్పోయారని ఇజ్రాయెల్ సైన్యం మంగళవారం మీడియాకు తెలిపింది. దక్షిణ గాజాలోని కీలకమైన ఖాన్ యూనస్ నగరంలో సోమవారం ఇజ్రాయెల్ బలగాలు చేపట్టిన బాంబు దాడుల్లో కనీసం 50 మంది పాలస్తీనియన్లు చనిపోయారని సమాచారం.

మూడు కూనలకు జన్మనిచ్చిన నమీబియా చీతా

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని కునో పార్కులో మరో మూడు చీతా కూనలు సందడి చేస్తున్నాయి. నమీబియా నుంచి తెచ్చిన జ్వాల చీతా ఈ నెల 20న వీటికి జన్మనిచ్చింది. 'కునోలో కొత్త కూనలు! జ్వాల మూడు పిల్లలకు జన్మనిచ్చింది. వన్యప్రాణి సంరక్షకులకు, ప్రేమికులకు శుభాకాంక్షలు' అని మంగళవారం కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ ట్వీట్ చేశారు. 10 నెలల విరామం తర్వాత జ్వాల రెండోసారి పిల్లలను ఈనింది. గతంలో ఈనిన నాలుగు పిల్లల్లో ఒకటి మాత్రమే బతికింది.

పాలిటికల్ ఈవెంట్లకు సెలవిస్తారు ..

నేతాజీ జయంతికి ఇవ్వరా?: మమత

కోల్‌కతా, జనవరి 23: రాజకీయ కార్యక్రమాలకు సెలవు ప్రకటిస్తారు కానీ, నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతికి ఎందుకు సెలవు ప్రకటించరని కేంద్ర ప్రభుత్వాన్ని బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ప్రశ్నించారు. అయోధ్య రామాలయం ప్రారంభోత్సవం నేపథ్యంలో పలు రాష్ట్రాల్లో సెలవు ప్రకటించిన నేపథ్యంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. నేతాజీ జయంతి రోజున సెలవు ప్రకటించాలని కేంద్రంపై పలుమార్లు ఒత్తిడి తెచ్చినా ఫలితం లేకుండా పోయిందన్నారు. నేతాజీ అదృశ్యమై ఏండ్లు గడుస్తున్నా.. ఆయనకు ఏమైందనే విషయం తెలియకపోవడం దేశానికి అవమానకరం అని అన్నారు.

హైకమాండ్ పట్టించుకోవట్లేదు!

- ప్రభుత్వ బోర్డులు, కార్పొరేషన్ల నియామకాలపై మా సూచనలు లెక్కలోకి తీసుకోవట్లేదు
- కాంగ్రెస్ అభిప్రాయం తీరుపై కర్ణాటక హోంమంత్రి పరమేశ్వర అసంతృప్తి
- తెగని పదవుల పంచాయితీ

పరమేశ్వర

బెంగళూరు, జనవరి 23: కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో ప్రభుత్వ బోర్డులు, కార్పొరేషన్లలో నియామకాల లొల్లి కొనసాగుతూనే ఉన్నది. రాష్ట్రంలో గత ఏడాది ఆ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఈ తంతు తెగట్లేదు. పదవుల వ్యవహారం ఓ కొలిక్కి రాకపోవడంతో పార్టీ సీనియర్ నేతలు, ఎమ్మెల్యేలు, మంత్రుల్లో అసంతృప్తి రేగుతున్నది. రాష్ట్ర హోంమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత జీ పరమేశ్వర మంగళవారం మాట్లాడుతూ పార్టీ హైకమాండ్ తీరుపై బహిరంగంగానే తన అసంతృప్తి వెళ్లగక్కారు. బోర్డులు, కార్పొరేషన్ల అధ్యక్ష, ఉపాధ్యక్ష నియామకాలకు సంబంధించి తాను చేసిన సూచనలను అధిష్ఠానం పరిగణనలోకి తీసుకోవడం లేదని పేర్కొన్నారు. నియామకాల విషయంలో ఏ ఒక్కరూ కూడా తమ అభిప్రాయాలు కోరలేదని తెలిపారు. 'పేర్లు ఇవ్వమని నన్ను అడిగారు. నేను వాటిని పార్టీ హైకమాండ్‌కు ఇచ్చాను. కానీ జాబితా ఖరారు చేసేందుకు సమావేశం ఏర్పాటు చేయలేదు, అభిప్రాయాలు కోరలేదు' అని పరమేశ్వర పేర్కొన్నారు.

అంతా వారిదే పెత్తనం!

హోంమంత్రి పరమేశ్వర ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శులుగా ఉన్న రణదీప్ సుర్జేవాలా, కేసీ వేణుగోపాల్‌లను లక్ష్యంగా చేసుకొని పలు వ్యాఖ్యలు చేశారు. బోర్డులు, కార్పొరేషన్ల పదవుల నియామకాలను సీఎం, డిప్యూటీ సీఎంలు జిల్లా స్థాయి నాయకులతో సంప్రదింపులు చేసిన తర్వాత జాబితాను తయారు చేయాలి కానీ, పార్టీ ప్రధాన కార్యదర్శి లిస్టును సిద్ధం చేస్తున్నారని ఎత్తిచూపారు. అనవసరంగా నియామకాల్లో తీవ్ర జాప్యం జరుగుతున్నదని పరమేశ్వర అసహనం వ్యక్తం చేశారు. 'నేను కూడా పార్టీ అధ్యక్షుడిగా 8 ఏండ్లు పనిచేశాను. నేతలు, పార్టీ అభివృద్ధికి వారు చేసిన కృషి గురించి నాకు తెలుసు. దశాబ్దాల పాటు పార్టీ కోసం పనిచేసిన వారు ఉన్నారు. అలాంటి వారికి పదవులు ఇచ్చి గౌరవం ఇవ్వాలి. అంతేగానీ పార్టీ కోసం ఏమాత్రం పాటుపడని వారికి పదవులు ఇస్తే, అది పార్టీపై విశ్వాసం ఉండే వారిని మనస్తాపానికి గురిచేస్తుంది' అని పరమేశ్వర అన్నారు. నియామకాలపై తుది నిర్ణయం తీసుకునే కంటే ముందుగానే సీనియర్ నేతలు, పార్టీ జిల్లా అధ్యక్షుల అభిప్రాయాలు, సూచనలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నదని ఆయన అభిప్రాయపడ్డారు.

అందరి అభిప్రాయాలు తీసుకోవడం కష్టం

మరోవైపు బోర్డులు, కార్పొరేషన్ల నియామకాల కోసం పేర్లను ఖరారు చేశామని సీఎం సిద్ధరామయ్య పేర్కొన్నారు. జాబితాపై పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కూడా సంతకం చేశారని తెలిపారు. హోంమంత్రి పరమేశ్వర వ్యాఖ్యలపై సీఎం స్పందిస్తూ.. అందరి అభిప్రాయాలు తీసుకోవడం కష్టమని పేర్కొన్నారు.

- మెదడుకు సర్జరీ చేస్తుంటే గిటార్ వాయించాడు!

అమెరికాలోని ఫ్లోరిడాకు చెందిన గిటారిస్ట్ క్రిస్టిన్ నోలన్ తనకు మెదడు కణతి శస్త్రచికిత్స జరుగుతుంటే గిటార్ వాయించి అందరినీ ఆశ్చర్యానికి గురి చేశాడు. సిల్వెస్టర్ కాంప్రిహెన్సివ్ క్యాన్సర్ సెంటర్ ఈ వీడియోను యూట్యూబ్‌లో పోస్ట్ చేసింది. శస్త్రచికిత్స సందర్భంగా రోగి మేల్కొని ఉండటం అత్యంత కీలకమని, తద్వారా కణతి తొలగించే సమయంలో అతడి కదలికలను పరిశీలించే అవకాశం ఉంటుందని తెలిపింది.

జాంబీ వైరస్‌తో మరో మహమ్మారి!

లండన్, జనవరి 23: సైబీరియాలో వేల ఏండ్లుగా మంచుకింద నిక్షిప్తమై ఉన్న జాంబీ వైరస్ మళ్లీ పునరుజ్జీవం పొంది మరో మహమ్మారిగా మారే ప్రమాదం ఉన్నదని శాస్త్రవేత్తలు హెచ్చరించారు. భూతాపం, షిప్పింగ్, మైనింగ్ వంటి మానవ కార్యకలాపాల వల్ల జాంబీ వైరస్ వ్యాప్తి చెందే అవకాశం ఉన్నట్టు తాజా అధ్యయనం పేర్కొన్నది. ఫ్రాన్స్‌కు చెందిన ఎయిక్స్-మార్సిల్లీ విశ్వవిద్యాలయ పరిశోధకులు ఈ అధ్యయనం నిర్వహించారు. చరిత్రలో అత్యంత వేడి సంవత్సరంగా 2023 నమోదైన విషయం తెలిసిందే. రికార్డు స్థాయిలో భూమి వేడెక్కిన నేపథ్యంలో జాంబీ వైరస్ వ్యాప్తి చెందే ప్రమాదం పెరిగిందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

వైద్య కళాశాలల్లో సీట్ లీవింగ్ బాండ్ పాలసీ వద్దు

- అన్ని రాష్ట్రాలకు ఎన్ఎంసీ విజ్ఞప్తి

న్యూఢిల్లీ: వైద్య కళాశాలల్లో సీట్ లీవింగ్ బాండ్ విధానాన్ని రద్దు చేయాలని నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను కోరింది. విద్యార్థులకు సహాయకరమైన వాతావరణాన్ని సృష్టించడంతోపాటు వారి మానసిక ఆరోగ్య సమస్యల పరిష్కారానికి చేయూతనిచ్చేందుకు ఈ విజ్ఞప్తి చేసింది. తమ రాష్ట్రంలో సీటును వదులుకోవాలనుకునే విద్యార్థులపై విపరీతమైన సీట్ లీవింగ్ బాండ్‌ను మోపడానికి బదులుగా మరుసటి ఏడాదికి వారిని అడ్మిషన్ నుంచి డిబార్ చేసే అంశాన్ని రాష్ట్రాలు పరిశీలించాలని ఎన్ఎంసీ యాంటీ ర్యాగింగ్ కమిటీ ఇటీవల సిఫారసు చేసింది. ఈ నేపథ్యంలో అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల వైద్య విద్యాశాఖల ముఖ్య కార్యదర్శులకు ఎన్ఎంసీ అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ బోర్డు ప్రెసిడెంట్ డాక్టర్ అరుణ వీ వాణికర్ ఈ నెల 19న లేఖ రాశారు. దేశవ్యాప్తంగా వివిధ వైద్య విద్యా సంస్థల్లో విద్యార్థులు, ముఖ్యంగా పీజీ స్టూడెంట్లు ఆందోళనకర స్థాయిలో మానసిక ఒత్తిడిని, నిస్పృహను ఎదుర్కొంటున్నట్టు ఎన్ఎంసీకి ఫిర్యాదులు అందాయని ఆ లేఖలో పేర్కొన్నారు. ఇది బాధిత విద్యార్థులపై ఆర్థికంగా ఒత్తిడిని పెంచుతున్నదని ఆమె తెలిపారు.

అధిక వడ్డీలు వసూలు చేస్తున్నా పట్టదా?

- ఆర్‌బీఐపై అలహాబాద్ హైకోర్టు ఘాటు వ్యాఖ్య

ప్రయాగ్‌రాజ్, జనవరి 23: తాము జారీ చేసిన నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ కొన్ని బ్యాంకులు విచ్చలవిడిగా అధిక వడ్డీ రేట్లను వసూలు చేస్తున్నా దేశ కేంద్ర బ్యాంకైన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మౌన ప్రేక్షకుడిలా చూస్తూ ఉందని అలహాబాద్ హైకోర్టు ఘాటుగా వ్యాఖ్యానించింది. ఆర్‌బీఐ మార్గదర్శకాలు ప్రకటిస్తుంది తప్ప, ఆశ్చర్యంగా దానిని అమలు చేయదని జస్టిస్‌లు మహేష్ చంద్ర త్రిపాఠి, ప్రశాంత్ కుమార్ ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ కేసులో వినియోగదారునికి న్యాయం చేయడంలో విఫలమైన బ్యాంక్ అంబుడ్స్‌మన్ తిరిగి అతని సమస్య పరిశీలించి ఫిర్యాదుదారునికి న్యాయం చేయాలని ఆదేశించింది. మన్మీత్ సింగ్ అనే వ్యక్తి స్టాండర్డ్ చార్టెడ్ బ్యాంక్ నుంచి 9 లక్షలు రుణంగా తీసుకున్నాడు. అతను క్రమం తప్పకుండా రుణ బకాయి చెల్లించినా అతని నుంచి రూ.27 లక్షలు వసూలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా 12.5 శాతానికి బదులుగా, 17 శాతానికి పైగా వడ్డీ వసూలు చేశారు. దీనిపై బ్యాంక్ అంబుడ్స్‌మెన్‌ను సంప్రదించినా అతనికి న్యాయం జరగలేదు. దీంతో అతడు అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించారు.

మాల్దీవులకు చైనా నిఘా నౌక!

- భారత్‌తో వివాదం వేళ కీలక పరిణామం
- నిశితంగా గమనిస్తున్నామన్న భారత నేవీ అధికారులు

న్యూఢిల్లీ, జనవరి 23: భారత్‌తో మాల్దీవుల వివాదం వేళ పరిశోధన నౌకగా చెప్పే చైనా నిఘా నౌక ఒకటి మాల్దీవుల దిశగా ప్రయాణం సాగిస్తుండటం చర్చనీయాంశంగా మారింది. ఈ చైనీస్ నౌక జావా-సుమత్రా మధ్య ఉండే సుండా జలసంధిని దాటిన తర్వాత ప్రస్తుతం హిందూ మహాసముద్రం రీజియన్‌లోని ఇండోనేషియా తీరంలో ప్రయాణిస్తున్నదని మైరెన్ ట్రాకర్ యాప్ వెల్లడించింది. ఈ షిప్ ఫిబ్రవరి 8న మాల్దీవులకు చేరే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది. ఈ చైనా గూఢచారి నౌక హిందూ మహాసముద్ర జలాల్లో 2019, 2020లలో సర్వే చేసిందని భౌగోళిక నిపుణుడు డామియెన్ సైమన్ పేర్కొన్నారు. కాగా, మాలె దిశగా ప్రయాణిస్తున్న 'షియాంగ్ యాంగ్ హాంగ్ 03' నౌకపై భారత నేవీ దృష్టి సారించింది. ఈ నౌక విషయం తమకు తెలుసునని, దాని కదలికలను నిశితంగా గమనిస్తున్నామని అధికారులు పేర్కొన్నారు. చైనాకు అనుకూలంగా ఉండే మాల్దీవుల అధ్యక్షుడు మహ్మద్ ముయిజ్జు భారత్‌తో గిల్లికజ్జాలు కోరుకుంటున్న విషయం తెలిసిందే. భారత్ పైనా, ప్రధాని మోదీపైనా మాల్దీవుల మంత్రులు చేసిన అనుచిత వ్యాఖ్యలు ఇరుదేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు రాజేసిన విషయం విదితమే. ఇది జరిగిన తర్వాతనే చైనాలో పర్యటించిన ముయిజ్జు.. ఆ దేశాధ్యక్షుడు జిన్‌పింగ్‌తో సమావేశం అయ్యారు. ఆ తర్వాత తమ దేశంలోని భారత సైనికులు వెళ్లిపోవాలంటూ డెడ్‌లైన్ పెట్టారు. తాజాగా మాల్దీవుల వైపు చైనా నిఘా నౌక వెళ్తున్న పరిణామం చోటుచేసుకొన్నది. గతంలో కూడా ఇదే తరహాలో చైనా నౌక శ్రీలంక తీరంలో నిఘా కార్యకలాపాలు నిర్వహించడంపై భారత్ అభ్యంతరం వ్యక్తం చేసింది.

భద్రతామండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వ లేమి అసంబద్ధం: మస్క్

న్యూయార్క్: ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి (యూఎన్ఎస్సీ)లో భారత్‌కు శాశ్వత సభ్యత్వం లేకపోవడంపై స్పేస్ ఎక్స్ సీఈవో ఎలాన్ మస్క్ తీవ్రంగా స్పందించారు. ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన భారత్‌కు చోటు లేకపోవడం 'అసంబద్ధం' అని వ్యాఖ్యానించారు. యూఎన్ఎస్సీలో ఏ ఒక్క ఆఫ్రికా దేశానికీ శాశ్వత సభ్యత్వం లేకపోవడంపై ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరెస్ 'ఎక్స్'లో ఆందోళన వ్యక్తం చేశారు. సంస్థలు నేటి ప్రపంచాన్ని ప్రతిబింబించాలి తప్పితే 80 ఏళ్ల క్రితాన్ని కాదని పేర్కొన్నారు. గుటెరస్ పోస్టుకు అమెరికాకు చెందిన ఇజ్రాయెలీ పెట్టుబడిదారు మైఖేల్ ఐసెన్‌బెర్గ్ స్పందిస్తూ 'మరి భారత్ సంగతేంటని?' ప్రశ్నించారు. ఈ చర్చలో జోక్యం చేసుకున్న మస్క్ ఐరాస నిర్మాణం సరిగా లేదని, అత్యధిక జనాభా కలిగిన భారత్‌కు అందులో శాశ్వత సభ్యత్వం లేకపోవడం 'అసంబద్ధం' అని పేర్కొన్నారు. దీనిని సంస్కరించాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. శక్తిమంతమైన దేశాలు తమ స్థానాలను వదులుకోకపోవడమే ఈ పరిస్థితికి కారణమని విమర్శించారు.

చిత్రం

హనుమాన్ పాత్రలో రామ్‌చరణ్?

సంక్రాంతి పర్వదినం సందర్భంగా విడుదలైన 'హను-మాన్' చిత్రానికి చక్కటి ఆదరణ లభిస్తున్నది. తేజ సజ్జా కథానాయకుడిగా ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో దూసుకుపోతున్నది. ఇప్పటికే 200కోట్ల వసూళ్ల క్లబ్‌లో చేరింది. ఈ సినిమాకు సీక్వెల్‌గా 'జై హనుమాన్' రాబోతున్న విషయం తెలిసిందే. ఈ సినిమా స్క్రిప్ట్ వర్క్ మొత్తం పూర్తయిందని, భారీ హంగులతో తెరకెక్కించబోతున్నామని దర్శకుడు ప్రశాంత్‌వర్మ ఇటీవలే ప్రకటించారు. హనుమాన్ పాత్రలో ఓ అగ్ర హీరో నటిస్తారని ఆయన చెప్పారు. దాంతో ఈ విషయంపై సోషల్‌మీడియాలో జోరుగా చర్చలు జరుగుతున్నాయి. హనుమాన్ పాత్రలో రామ్‌చరణ్ నటించబోతున్నారనే వార్త ట్రెండింగ్‌లో ఉంది. రామ్‌చరణ్ స్వతహాగా ఆంజనేయుడి భక్తుడు కావడంతో ఈ వార్తలకు మరింత ప్రాధాన్యత ఏర్పడింది. అయితే ఈ ప్రచారంలో నిజమెంతో తెలియాలంటే చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందేనని అభిమానులు అంటున్నారు. ఇదిలా వుండగా శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ నటిస్తున్న తాజా చిత్రం 'గేమ్ ఛేంజర్' సెప్టెంబర్‌లో ప్రేక్షకుల ముందుకురానుంది.

కాస్త బ్రేక్ కావాలి!

అచ్చ తెలుగు అందం శ్రీలీలకు అవకాశాలైతే వస్తున్నాయి కానీ అదృష్టం మాత్రం కలిసి రావడం లేదు. అరంగేట్రం చేసిన అనతికాలంలోనే ఈ భామ తారాపథంలో దూసుకుపోయింది. యువతరంలో తిరుగులేని ఫాలోయింగ్ సంపాదించుకోవడంతో వరుసగా భారీ అవకాశాలు వరించాయి. అయితే ఆ స్థాయిలో విజయాలు దక్కలేదు. ఇటీవల విడుదలైన 'గుంటూరు కారం' చిత్రంలో శ్రీలీల పాత్రకు అంతగా ప్రాధాన్యం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో సినిమాలకు కాస్త విరామమిచ్చి తన చదువుపై దృష్టి పెట్టాలని నిర్ణయించుకుందట. శ్రీలీల వైద్య విద్యార్థిని అనే విషయం తెలిసిందే. ఓవైపు సినిమాలు చేస్తూనే ఈ అమ్మడు చదువును కూడా కొనసాగిస్తున్నది. గత రెండేళ్లుగా వరుస షూటింగ్స్‌తో చదువుపై అంతగా దృష్టి పెట్టలేకపోయిందట. ప్రస్తుతం ఈ భామ చేతిలో రెండు చిత్రాలున్నాయి. ఈ నేపథ్యంలో సినిమాలకు కాస్త బ్రేక్‌నిచ్చి చదువుపై దృష్టిపెట్టబోతున్నదట. కథల ఎంపికలో కూడా ఆచితూచి వ్యవహరించాలనే నిర్ణయానికొచ్చిందని అంటున్నారు.

తన్వి నేగి, దీపక్ సరోజ్

సిద్ధార్థ్‌రాయ్ ప్రేమకథ

దీపక్ సరోజ్ కథానాయకుడిగా పరిచయమవుతున్న చిత్రం 'సిద్ధార్థ్ రాయ్'. వి.యశస్వీ దర్శకుడు. శ్రీరాధా దామోదర్ స్టూడియోస్, విహాన్ అండ్ విహిన్ క్రియేషన్స్ సంస్థలు నిర్మించాయి. మంగళవారం థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేశారు. హీరో సిద్ధార్థ్ రాయ్ బాల్యం నుంచి ఇరవై ఏళ్ల వయసు వరకు జీవితాన్ని ట్రైలర్‌లో చూపించారు. ఓ దశలో ఎలాంటి భావోద్వేగాలు లేని సిద్ధార్థ్‌రాయ్ అనుకోని సంఘటనల వల్ల కోపస్వభావిగా, అహంకారిగా మారతాడు. అవే అతని పాలిట శత్రువులవుతాయి. ఈ నేపథ్యంలో అతను పడే సంఘర్షణతో ట్రైలర్ ఆద్యంతం ఉద్వేగభరితంగా సాగింది. మల్టీపుల్ షేడ్స్ ఉన్న పాత్రలో దీపక్ సరోజ్ మెప్పించాడు. ఈ సందర్భంగా కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్ మట్లాడుతూ..ఇలాంటి కాన్సెప్ట్ ఇప్పటివరకు రాలేదని, ఈ తరహా సినిమాలు తీయాలంటే చాలా ధైర్యం కావాలన్నారు. దర్శకుడు వి. యశస్వీ మాట్లాడుతూ 'ఈ సినిమా చూసిన ప్రముఖ దర్శకుడు సుకుమార్‌గారు తన బ్యానర్‌లో నా తదుపరి సినిమాకు అవకాశమిచ్చారు. 'సిద్ధార్థ్ రాయ్' చిత్రాన్ని ఫిబ్రవరిలో విడుదల చేయబోతున్నాం' అన్నారు. తన క్యారెక్టర్‌లోని ఇంటెన్సిటీ ప్రతి ఒక్కరిని సర్‌ప్రైజ్ చేస్తుందని హీరో దీపక్ సరోజ్ తెలిపారు. రొటీన్‌కు భిన్నమైన కథతో తాము చేస్తున్న ప్రయత్నం ప్రేక్షకుల మెప్పు పొందుతుందని నిర్మాతలు అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: శ్యామ్ కె నాయుడు, సంగీతం: రధన్, నిర్మాతలు: జయ ఆడపాక, ప్రదీప్‌పూడి, సుధాకర్ బోయిన, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: వి.యశస్వీ.

అమెరికా ఘటనల ఆధారంగా..

అమెరికాలో జరిగిన యథార్థ సంఘటనల ఆధారంగా తెరకెక్కిస్తున్న ఆంథాలజీ చిత్రం 'మూడో కన్ను'. నాలుగు కథలుగా నలుగురు దర్శకులు తెరకెక్కించబోతున్నారు. సూరత్ రాంబాబు, కె.బ్రహ్మయ్య ఆచార్య, కృష్ణమోహన్, సురేంద్రబాబు దర్శకులుగా పరిచయమవుతున్నారు. ఈ నెల 26న విడుదలకానుంది. మంగళవారం ట్రైలర్‌ను లాంచ్ చేశారు. సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్ చిత్రమిదని, అనుక్షణం ఉత్కంఠను పంచుతూ సాగుతుందని దర్శకుడు తెలిపారు. సాయికుమార్, శ్రీనివాస రెడ్డి, నిరోషా, కాశీవిశ్వనాథ్ తదితరులు నటించిన ఈ చిత్రానికి నిర్మాతలు: కె.వి.రాజమహి, సునీత రాజేందర్ దేవులపల్లి.

సందేశంతో 'బిఫోర్ మ్యారేజ్'

భరత్, నవీన రెడ్డి జంటగా నటిస్తున్న చిత్రం 'బిఫోర్ మ్యారేజ్'.శ్రీధర్ రెడ్డి దర్శకత్వంలో ఎద్దుల జగదీశ్వర్ రెడ్డి నిర్మించారు. ఈ నెల 26న విడుదలకానుంది. మంగళవారం ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. దర్శకుడు మట్లాడుతూ 'న్యూ ఏజ్ యూత్‌ఫుల్ లవ్‌స్టోరీ ఇది. పెళ్లికి ముందు చేసే కొన్ని పొరపాట్ల వల్ల జీవితం అనూహ్య మలుపులు తీసుకుంటుంది. ఇదే అంశాన్ని ఈ సినిమాలో చూపించాం. లవ్, రొమాన్స్‌తో పాటు అంతర్లీనంగా చక్కటి సందేశం ఉంటుంది' అన్నారు. యథార్థ సంఘటనల స్ఫూర్తితో ఈ సినిమా తీశామని నిర్మాత ఎద్దుల జగదీశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: రాజశేఖర్ రెడ్డి, సంగీతం: పీఆర్, దర్శకత్వం:శ్రీధర్ రెడ్డి.

నవీన రెడ్డి

రవితేజ కామెడీ ఎంటర్‌టైనర్



రవితేజ కొంతకాలంగా వరుసగా యాక్షన్ సినిమాలే చేస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం ఆయన రూట్ మార్చి ఫుల్‌లెంగ్త్ కామెడీ సినిమా చేయబోతున్నట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే...'జాతిరత్నాలు' ఫేమ్ అనుదీప్ దర్శకత్వంలో రవితేజ కథానాయకుడిగా ఓ చిత్రం తెరకెక్కబోతున్నది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ నిర్మించనుంది. ఈ సినిమా ఆసాంతం వినోద ప్రధానంగా సాగుతుందని చెబుతున్నారు. ఇందులో రవితేజ దొంగ పాత్రలో కనిపిస్తారని, ఆయన పాత్రను తీర్చిదిద్దిన విధానం చాలా కొత్తగా ఉంటుందని అంటున్నారు. 'జాతిరత్నాలు' తరహాలో ప్రేక్షకులకు పూర్తిస్థాయి వినోదాన్ని పంచే కథాంశమిదని సమాచారం. ఈ సినిమాలో రవితేజ సరసన కన్నడ భామ రుక్మిణి వసంత్ కథానాయికగా నటించనుందని వార్తలొస్తున్నాయి. ఈ సినిమాకు సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ తుదిదశలో ఉన్నట్లు తెలిసింది. ప్రస్తుతం రవితేజ 'మిస్టర్ బచ్చన్' చిత్రంలో నటిస్తున్నారు. అది పూర్తయిన వెంటనే అనుదీప్ దర్శకత్వం వహించే చిత్రం పట్టాలెక్కనుంది.

అన్నీ పర్‌ఫెక్ట్‌గా కుదిరాయి

సుప్రియ యార్లగడ్డ, లావణ్య త్రిపాఠి, అభిజిత్, అభిజ్ఞ

లావణ్య త్రిపాఠి, అభిజిత్, అభిజ్ఞ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న వెబ్ సిరీస్ 'మిస్ పర్ఫెక్ట్'. అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై సుప్రియ యార్లగడ్డ నిర్మించారు. విశ్వక్ ఖండేరావ్ దర్శకుడు. ఫిబ్రవరి 2వ తేదీ నుంచి డిస్నీ హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ కానుంది. మంగళవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఆద్యంతం చక్కటి వినోదంతో సాగే సిరీస్ ఇది. ప్రతీ పాత్ర నవ్వుల్ని పంచుతుంది. కాన్సెప్ట్ కూడా కొత్తదనంతో ఆకట్టుకుంటుంది. లావణ్య త్రిపాఠి పర్‌ఫార్మెన్స్ ప్రధానాకర్షణగా నిలుస్తుంది' అన్నారు. 'అన్నపూర్ణ సంస్థ కొత్త టాలెంట్‌ను ఎప్పుడూ ప్రోత్సహిస్తుంది. ఈ సిరీస్‌తో అదే ప్రయత్నం చేశాం. ఈ కథ లావణ్య త్రిపాఠికి పర్‌ఫెక్ట్‌గా కుదిరింది. చిన్న కథలో బలమైన పాత్రలు, భావోద్వేగాలు ప్రేక్షకులను మెప్పిస్తాయి' అని సుప్రియ పేర్కొంది. లావణ్య త్రిపాఠి మాట్లాడుతూ 'ఈ సిరీస్ మొదలుపెట్టినప్పుడు నేను మిస్ పర్ఫెక్ట్. సిరీస్ పూర్తయ్యే లోపు మిసెస్ పర్ఫెక్ట్‌గా మారాను (నవ్వుతూ). కొత్తదనంతో కూడుకున్న కథాంశమిది. టైటిల్‌కు తగినట్లే అన్ని విషయాల్లో పర్‌ఫెక్ట్‌గా ఉంటుంది' అని చెప్పింది. ఈ కార్యక్రమంలో సిరీస్ యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

బాల రాజశేఖరుని, రామ్‌గోపాల్‌వర్మ, కెకె ఆర్

రొమాంటిక్ 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్'

చైతన్య రావు, హెబ్బా పటేల్ జంటగా నటిస్తున్న చిత్రం 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్'. బాల రాజశేఖరుని దర్శకుడు. కెకె ఆర్, బాలరాజ్ నిర్మాతలు. ఈ సినిమాలోని 'నిజమా..' అనే గీతాన్ని ప్రముఖ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ విడుదల చేశారు. కల్యాణి మాలిక్ స్వరపరచిన ఈ పాటను సునీత ఆలపించారు. దర్శకుడు మాట్లాడుతూ 'రామ్‌గోపాల్‌వర్మ సినిమాలకు దర్శకత్వం శాఖలో పనిచేశాను. 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్' రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్. ఓ ప్రేమ జంట ప్రయాణానికి దృశ్యరూపంలా ఆకట్టుకుంటుంది. తనికెళ్ల భరణి, సుహాసినీ కీలక పాత్రల్లో కనిపిస్తారు. త్వరలో చిత్రాన్ని విడుదల చేస్తాం' అన్నారు. అరవింద్‌కృష్ణ, అలీ, సురేఖవాణి, రవివర్మ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ, ఆర్ట్: శిష్టా విఎమ్‌కే, సంగీతం: కల్యాణి మాలిక్, దర్శకత్వం: బాల రాజశేఖరుని.